
# ఆత్మహత్యా...?

ఝాన్సీ కె. వి. కుమారి

కిటికీనుండి జాలువారుతూ తనువంతా ముద్దాడు తున్నాయ్ బాలభానుని లేతకిరణాలు.

ఆ వెచ్చదనానికి ఒళ్ళంతా పులకించిపోతూంటే పక్కమీద నుండి లేవాలనిపించక, ఆకిరణాల కౌగిల్లోనే ఇంకా ముడుచుకుపోతూ ఏవేవో లోకాల్లో తేలిపోతున్నాను.



నా అనుభూతికీ,ఆలోచనలకీ తటాలున అంతరాయం కలిగింది.

" అక్కా ... పేపర్ ...'

పేపర్ నా మొహాన పారేసి , చిటికెలో మాయమయ్యాడు తమ్ముడు రాజా.

ప్రతి శుభోదయం ఇదే కార్యక్రమమైనా, ఆ రోజెందుకో వాడిమీద చాలా కోపమొచ్చింది. విసుక్కుంటూ, కళ్ళు తెరచి , అలాగే పక్కమీదే ఉండి, పేపరు చదవసాగేను. ఆ వైపు నుండి ఈ వైపుకు తిరిగిన కళ్ళు ఒకచోట ఆగిపోయాయ్.

" ఏడాది పసిపాపతో తల్లి ఆత్మహత్య "

ఒక్క క్షణం శ్వాస తీస్కోవడం మర్చిపోయాను.

'భగవాన్.... ఈ ఆడవాళ్ళ ఆత్మహత్యలకు అంతం లేదా ? ' కనబడని దేవుణ్ణి కళ్ళు మూసుకుని అడిగాను. మనస్సు నిండా బాధ చోటుచేసుకుంది.

పేపరు పక్కనే పడేసి కళ్ళు మూసుకున్నాను. దిగులు మొఖంతో అరుణ, పాపాయి అనిత నెత్తుకుని నిలబడిం?

ఏదో అపశకునంలా తోచి, గుండె ఝల్లుమంది. కళ్లు తెరవడం, ఒక్క ఉదుటున పడక మీదనుండి లేవడం ఒకేసారి జరిగాయ్.

అల్మారా లోంచి చేతికందిన బట్టలు తీసుకుని బాత్రూంలోకి పరుగెత్తాను...రకరకాల ఆలోచనలు ఉధృత ప్రవాహంలా సాగిపోతున్నాయ్.

అరుణని వారం క్రితం చూసినప్పుడు నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. కానీ, పరిస్థితుల విషప్రభావాన్ని అర్థం చేస్కోగలగాను.

తాను నవ్వుతూ , తుళ్ళుతూ అందరినీ నవ్విస్తూ , చల్లని అహ్లాదకరమైన వాతావరణాన్ని తనచుట్టూ పంచిన ఒకనాటి అరుణకూ, కన్నీటిని గొంతుకలోనే దిగమింగి, విషాద కడలితో కొట్టుకుపోతూ, అప్యాయతకూ, ఆదరణకూ దూరమైన నేటి అరుణ కూ ఎంతతేడా !

పెళ్ళయిన రెండు సంవత్సరాలల్లో ఎలా అయిపోయింది మనిషి? వెధవ పెళ్ళి... దాని అందాన్నీ ,ఆనందాన్నీ బలితీసుకుంది.

"ఎందుకే ఇలా తయారయ్యావ్...ఏమైందో చెప్పవేమే?'

అంతే జీవంలేని , ఏడుపులాంటి ఓనవ్వు నవ్విందే గానీ, సంగతేమిటో చెప్పలేదు.

"వనూ, త్వరగా రా " అమ్మ గట్టిగా పిలుస్తూ, తలుపు దబదబా బాదుతోంది.

" స్నానాల గదిలోకి వెళ్తే ప్రపంచాన్ని మర్చి పోతుంది' అమ్మ గొణుగుతోంది.

"వనూ,త్వరగారాతల్లీ...అవతల కొంపలంటుకు పోతున్నాయి" అమ్మ గొంతులో ఆందోళన, ఆతృత !?

"ఆ...ఆ...వస్తున్నానమ్మా" లోపలి నుండే అరిచాను కానీ నాకెందుకో భయమేసింది.

"కొంపలంటుకుపోతున్నాయంటోందేమిటీ అమ్మ ? ఛ... ఈ రోజేవిటో ఇలా మొదలైంది. గబగబా బట్టలు చుట్టుకొని నా గదిలోకి పరిగెత్తాను. నా వెనకే అమ్మ వచ్చింది. అమ్మ మొహం చూసిన నేను క్షణం నివ్వెర పోయాను. .. తనంత విషాదంగా ఉండడం నేనింత వరకూ చూడలేదు.

"ఏమిటమ్మా... ఏమైంది ? " నా గొంతులో ఆందోళనా, భయం కలిసిపోయాయ్.

"వనూ,ఇలా కూర్చో" అంటున్న అమ్మ మొహంలోకి చూస్తూ, పక్కనే కూర్చున్నాను.

"చిన్నీ , పుట్టిన ప్రతి ఒక్కరూ ఏదో ఒక రోజు చనిపోవాల్సిందే... ఈ బంధాలను, అనుబంధాలను తెంపుకుని , ఒంటరిగా వెళ్ళిపోవాల్సిందే... కాకపోతే ... కాస్త ముందు, వెనుకలుగామన కత్యంత ఆత్మీయులూ, అప్తులూ మనముందు వెళ్ళిపోతే తట్టుకోవడం కష్టమే...అయినా తప్పదు ..." విరాగినిలా ఎటో చూస్తూ అమ్మ చెప్తూంటే, కోటి అనుమానాలు నా గుండెను తొలిచివేస్తున్నాయ్.

"అమ్మా... ప్లీజ్...నువ్వు చెప్ప దల్చుకున్నది తొందరగా చెప్పమ్మా ఈ సస్పెన్స్ నేను భరించలేను." అమ్మ - భుజాలను గట్టిగా పట్టుకుని ఊపేశాను.

"చిన్నీ ... మన అరుణ.. ఇంక మనకిలేదు.."

ఎవరో కసిగా నా గుండెల్లో బాకుతో గుచ్చారు.

"నో"...మా బంగళా ప్రతిధ్వనించిందేమో!ఏమైందో ఏమోతోందో నాకు తెలియడం లేదు. అమ్మ నన్ను పట్టుకుని తన హృదయానికి హత్తుకుంది. నా గుండె పగిలి,రక్తం కన్నీటి రూపంలో ప్రవహిస్తోంది.

నా అరుణ, నా ప్రియ నెచ్చెలి , నా ప్రాణంలో ప్రాణం.. ఎక్కడికి వెళ్ళింద...ఎక్కడు వెళ్ళ ంది ...? అమ్మ కూడా వెక్కిపడుతోంది... మరి ... అరుణా, నేనూ కవల పిల్లల్లా తిరిగేవాళ్ళం.

"అమ్మా, ఆటో వచ్చింది.... బయలుదేరండి!చిన్నా ఊర్కో... మనం త్వరగా వెళ్ళాలి... ఆలస్యమైతె ఆఖరిచూపు కూడా దక్కదు...లేవండి " అన్నయ్య నన్ను లేపి నడిపించుకువెళ్తూంటే ఎలావెళ్ళానో నాకే తెలియదు...

ఆటో కదిలి స్పీడందుకుంది. మరొకప్పుడైతే ఈ స్పీడును మించిన వేగంతో పరుగెత్తేవి నా ఆలోచనలు. కానీ ... ఇపుడు అంతా అయోమయం గాఉంది.

"రాత్రి పడుకునేటప్పుడు మామూలుగానే అన్నీ సర్దేసి పడుకుందటమ్మా. రోజూ అందరికంటే ముందే లేచి , పనులు మొదలుపెట్టేదట. పాపాయికూడా కనిపించకపోతే బాత్రూమ్‌కు తీసికెళ్ళిందేమో అనుకుని, వాళ్ళత్తగారు పనిమనిషికి అంట్లు వేసిందట. పనిమినిషి నీళ్ళు తోడడానికి బావిదగ్గరికి వెళ్ళి కెవ్వున కేకవేసిందట... ఆ అరుపుకు వాళ్ళత్తా, మావయ్యా వెళ్ళి చూస్తే ఏముందీ..." అరుణా, పాపాయిల శవాలు నీళ్ళ మీద తేలుతున్నాయ్ ..." అన్నయ్య మాటలు నన్ను స్పృహలోకి తెచ్చాయ్.

"ఏమిటీ .. బావిలోకి దూకి చనిపోయిందా... ఆత్మహత్య చేస్కుందా ...? నాగొంతు నాకే భయంకరంగా విన్పించింది.


"ఔను తల్లీ... ఆ పిల్ల జీవితాన్ని పొట్టన పెట్టుకున్నారు ఆ దుర్మార్గులు ! పాపం... పసిబిడ్డతో సహా ఇంత పనిచేసిందంటే ఎంత టి నరక యాతన అనుభవించిందో...' ' అమ్మ గొంతులో జీర.

ఆటో ఆగింది.ఎదురుగా గుంపులుగుంపులు గా జనం... ఏవేవో మాటలు..జాలి వాక్కులూ, వేదాంత చర్చలూ, ఈసడింపులూ... అన్నీ కలగాపులగంగా వినిపిస్తున్నాయ్.

అన్నయ్య నన్నూ,నేను అమ్మనూ పట్టుకుని జనాన్ని తోసుకుంటూ ,ఎలాగో లోపలికివెళ్ళ-గలిగాం.

ఎదురుగా చాపమీద తెల్లటి దుప్పటి కప్పి ఉంచబడింది. ఎవరో ముసలావిడ వచ్చి " రండమ్మా, చూద్దురు గానీ " అని దగ్గరకు తీసికెళ్ళి దుప్పటికి తొలగించింది. అంతే ... బావురుమంటూ నా అరుణమీద వాలిపోయాను. అంతవరకూ నిగ్రహించుకున్న దుఃఖం ఆనకట్ట తెగిన ప్రవాహంలా ఉధృతంగా పొంగింది.

నాకు స్పృహ వచ్చేసరికి నా గదిలో, నా మంచం మీద ఉన్నాను . అమ్మా, నాన్న ఆందోళనగా చూస్తున్నారు. 'అరుణ...నా అరుణ..." గుండె కలవరిస్తోంది.కానీ ...ఏడ్చే శక్తి ఇంకిపోయిందనుకుంటా.అమ్మ బలవంతాన లేపి కాఫీ తాగించింది.




బి. సుధీర్, బి-39/15, లాబ్ క్వార్టర్స్, కాంచన్‌బాగ్, హైదరాబాద్ - 500 258.

నాన్న అనునయంగా తల నిమిరుతున్నారు. వాళ్ళందరికీ తెల్సు... నన్నెవరూ ఓదార్చలేరని. మరలా పడుకుని కళ్ళు మూసుకున్నాను.

గత స్మృతులు తెరలు తెరలు గా కదలాడసాగాయ్...

"నీది రూం నెంబర్ ఏడు. అరుణ అనే అమ్మాయి మీ క్లాసే, మీ ఇద్దరికి ఆ రూమ్ అలాట్ చేసా.లక్ష్మీ...ఈ అమ్మాయి సామాను ఏడో నెంబరు రూమ్‌లో పెట్టు..." అని వార్డెన్ సిస్టర్ అన్నప్పటినుండీ , రూంకెళ్ళేవరకూ... 'ఈ అరుణెవరో, ఎలా ఉంటుందో, సంవత్సరమంతాకలిసి ఉండాలి. అసలే నేను అంత తొందరగా మనుషుల్తో కలవలేను "... భయాలూ, సందేహాలూ బుర్రను తొలిచేసాయ్.

దగ్గరగావేసి ఉన్న తలుపును తట్టింది లక్ష్మి.

"ప్లీజ్ కమిన్ " లోపల్నించి కమ్మని గొంతు వినిపించింది.

'తలుపు తెరచి లోపలికెళ్ళిన లక్ష్మిని నేనూ అనుసరించాను. గదిలోరెండు మంచాలున్నాయ్... సింగిల్ కాట్...అటూ , ఇటూ . కిటికీ దగ్గర ఒక టేబులూ , రెండు కుర్చీలూ... ఆ మంచం వైపు ఆ గోడకు ఒక షెల్ఫ్.ఈ మంచంవైపు ఒక అర లో పుస్తకాలూ, ఒక అరలో కాస్మోటిక్స్, ఒకఅరలో అద్దం వగైరాలు , అడుగుదానిలో మగ్గు. సోప్పు... అన్నీ నీట్‌గా సర్ది ఉన్నాయ్.

అంతవరకూ మంచమ్మీద పడుకుని ఉన్న ఆ అమ్మాయి కంగారుగా లేచి కూర్చుంది.

"అరుణమ్మగారూ, ఇదిగో, ఈ వసుంధరమ్మగారూ, మీరూ రూమ్మేట్లు. నేను అటూ ఇటూ తిరుగుతూనే ఉంటాను.మీకేం కావాలన్నా చెప్పండి ...చేసి పడ్తాను" అంటూ మా ఇద్దర్నీ పరిచయంచేసి వెళ్ళిపోయింది " అంటూ మా ఇద్దర్నీ పరిచయం చేసి వెళ్ళిపోయింది హాస్టల్ అటెండర్ లక్ష్మి.

అరుణ ... పేరుకు తగినట్టుగానే ఉంది.

సూర్యుని లోని తేజస్సు ఆ కళ్ళూ,
చంద్రుని లోని చల్లదనాన్ని ఆ నవ్వూ ,
గులాబీల సోయగాన్ని ఆ చెక్కిళ్ళూ,
చేమంతుల పసిమి ఛాయను ఆ మేనూ
అరువు తెచ్చుకున్నాయేమో !

ఆ మొదటచూపులో నాకు కలిగిన ఈ భావాన్ని ప్రాణ స్నేహితులుగా మారిన తర్వాత చెప్పినప్పుడు నవ్వేస్తూ "నువ్వు కవయిత్రివి కదే. ప్రతీదీ కవితా వస్తువు గానే కనిపిస్తుంది " అంది.

"అందమైన నీ లాంటి నారీమణుల దర్శనం పుణ్యమా అనే పెద్దపెద్ద కవులంతా ఉద్గ్రంథాలు రాసి పారేసి. బిరుదుల్ని తగిలించేసుకున్నారు. దేనికైనా ప్రేరణ శక్తి అంటూ ఒకటుండాలి కదా అని నేనంటే అరుణ పకపకా నవ్వేసింది.

కంగారుగా లేచికూర్చున్న ఆ అమ్మాయి నన్ను చూసి తాపీగా నవ్వింది...."ఇప్పుడే జాయినవుతున్నారా? "

"ఆ ..ఆ.. అవునండీ తడబడ్తూ నేను.

"ఆ మంచమ్మీద మీ బెడ్ పరచుకొండి. బుక్స్ ఆ షెల్ఫ్‌లో సర్దుకోవచ్చు. ఆ ...అన్నట్టు కాఫీకి టైమయింది. ప్లేటూ,గ్లాసూ తెచ్చుకున్నారా ...పదండి డైనింగ్ హాలు కి వెళ్దాం ..."ఎంతో ఆత్మీయురాలిలా, కొత్త లేకుండా ఆమె మాట్లాడుతూంటే అంతవరకు నన్ను భయపెట్టిన సందేహాలన్నీ ఇట్టే ఎగిరిపోయాయ్.

"అమ్మా వాళ్ళు నా కోసం చూస్తూ ఉంటారు. రూం చూస్కొని, సామాను పెట్టుకురమ్మంటే వచ్చాను. మీకు ఆలస్యమవుతుందేమో ముందు మీరు కాఫీకెళ్ళండి..." కాస్త బిడియంగా, మరి కాస్త మొహమాటంగా అన్నాన్నేను. భలేవారే రెండు రోజుల నుండి తోడు కోసం ఎదురుచూస్తున్నా!ఇప్పుడొచ్చారు మీరు . ఇంకే వదుల్తానా.. రండి... నేనూ వస్తాను అమ్మావాళ్ళ దగ్గరకు" అంటూ గదికి తాళాలేసి బయల్దేరింది.

ఆ అమ్మాయి మాట్లాడే తీరూ, గౌరవ మర్యాదలూ అమ్మను బాగా ఆకట్టుకున్నాయి.

"అమ్మా అరుణా, మా చిన్నికి హాస్టల్‌లో ఉండడం కొత్త. దిగులు పడకుండా చూడమ్మా... ఇక నుంచి దానికి అన్నీ నువ్వే" ఆ అభ్యర్థనతోఅమ్మ కళ్ళు తడి అవడాన్ని చూసి న అరుణ క్షణం చలించింది.

"భలేవారండీ... మీకే బెంగా అక్కర్లేదు. ఈ క్షణం నుండీ ... అహ 10 నిమిషాల క్రితం నుండే తనకు నేను గార్డియన్నయ్యాను. మీరు నిశ్చింతగా ఉండొచ్చు. అరే .. ఉండండి... రెండు నిమిషాల్లో వచ్చేస్తాం"అంటూ నన్ను లాక్కెళ్ళింది.

డైనింగ్‌హాల్ చక్కగా, నీట్‌గా ఉంది. నా ఆలోచనల్లో నేనుండగానే తను వేడివేడి పకోడీ పొట్లం నాచేతిలో పెట్టి రెండు కాఫీ గ్లాసులు తను పట్టుకుని , "పద పద ...కాఫీచల్లారిపోతుంది" అంటూ హడావిడిగా నడవడం మొదలు పెట్టింది.


ఇదంతా ఎందుకో అర్థం కాక అయోమయంగా అనుసరించిన నాకు తెలిసింది అమ్మా వాళ్ళకు ఈ కాఫీ, ఫలహారాలనీ.

ఆ క్షణమే అరుణ మమతా, మంచితనం మా అందరి హృదయాల్లోనూ శాశ్వత ముద్రవేసుకున్నాయ్. తన కోసం గాక, తన చుట్టూ ఉన్నవారి కోసం ఆలోచించే హృదయం కలిగి,మానవత్వం మూర్తిభవించిన నా అరుణ ఆత్మహత్య ఎందుకు చేసుకుందీ...?

కట్టలు తెంచుకొస్తున్న నా ఏడుపు, నా ఆలోచనలను ఆపేసింది. నా వెక్కిళ్ళు విన్న అమ్మ పరుగెత్తికొచ్చింది. కాని... ఏమని ఓదార్చగలదు నన్ను, అసలు తానెలా ఓదార్పు పొందగలదు ?

అరుణ ఇద్దరుచెల్లెళ్ళూ, అమ్మానాన్నా...ఈ గుండె కోత ను ఎలా తట్టుకోగలరు ? పగిలి, ముక్కలైపోయిన ఆ హృదయాలు ఏమైపోతాయో , కన్నబిడ్డ పిల్లా పాపలతో కళకళ లాడుతూ, కళ్ళముందు తిరుగుతుందనుకొని, సంతోషంగా , క్షణాల్లా గడపాల్సిన సెలవురోజులు విషాదంగా, బరువుగా గడుస్తున్నాయ్. ఇక జీవితమంతా శూన్యమేనేమో అనిపిస్తోంది.

ఒకే ఒక్క ప్రశ్న,... జవాబు దొరకని ప్రశ్న... అందరి గుండెలనూ పిండి వేస్తోంది... 'అరుణ ఎందుకు ఆత్మహత్య




ఎమ్. శ్రీకర్, హెచ్.నం. 11-1-8/3, కంఠేశ్వర్, నిజామాబాద్

చేసుకుంది?'

వసుంధరా దేవీ... ప్రపంచానికెంత గొప్ప స్నేహ చిత్రాన్ని అందించేవ్... నీ నెచ్చెలి బాధేమిటో తెలుసుకోలేకపోయిన నువ్వు స్నేహితురాలివని ఎలా చెప్పుకోగలవ్?' అంతరాత్మ ప్రశ్నకు నా దగ్గర సమాధానం లేదు....

ఎందుకంటే...అరుణ తనకు సంతోషం, శుభం జరిగితే అది అందరితోనూ పంచుకుంటుంది. విషాదమైతే తానే దాచుకుంటుంది. ఈ విషయంలో మా ఇద్దరి మధ్యాఎన్నో వాగ్వివాదాలుజరిగాయి.

కానీ... నేనే ఓడిపోయాను...అప్పుడూ.... ఇప్పుడూ కూడా !

అరుణ లేని లోకంలో కాలం ఆగిపోలేదు. మూడు రోజులు గడిచిపోయాయ్.ఇంటిలో విషాదం స్థానే అందరిలోనూ నిర్లిప్తత చోటుచేసుకుంది.

ఇదివరకైతే ఇల్లంతానవ్వులు, కేరింతలతో గందరగోళంగా ఉండేది.ఇప్పుడు దుఃఖాన్ని ధరించినట్టుగా ఉంది. నాకు నా మంచమే శరణ్యమయ్యింది.ఎదురుగా గోడకు తగిలించి ఉన్న అరుణ ఫోటోను చూస్తూ, అరుణ జ్ఞాపకాల్లోనే గడుపుతున్నానేను.

ఆరోజు నాల్గోరోజు "పోస్ట్ " కేక వినిపించింది.

కాని నాకు లేవాలనిపించలేదు. ఇదివరకైతే ఆ పిలుపు విన్నప్పుడు ఎవరు,ఎక్కడున్నా, ఒక్క పరుగున వీధి గేట్లోకి వెళ్ళిపోయి , పోస్ట్‌మేన్ మీద పడిపోయేవారు కాని.... ఇప్పుడు పోస్ట్‌మేన్ తానే గేటు తీసుకుని లోపలికొచ్చి అప్పుడే అక్కడకొచ్చిన అమ్మచేతిలో కవరు పెట్టి వెళ్ళిపోయాడు.అమ్మకు చదవాలనిపించలేదేమో, సొగదికి వచ్చి "చిన్నీ , ఈ ఉత్తరమెక్కడిదో చూడు "అని నా చేతిలో పెట్టేసి వెళ్ళిపోయింది... బరువైన లేఖ.

ఆ రైటింగ్ చూసిన నేను ఉలిక్కిపడ్డాను....గభాల్న లేచి కూర్చుని , కవరు చింపాను.

"నా ప్రియమైన వసూ...

ఆశ్చర్యపడకు. నీకు ఉత్తరంఅందేటప్పటికి ఈ లోకంలో నా జాడలు నీ గుండెలో తప్ప మరెక్కడా ఉండవు. నేనిలా వెళ్ళిపోతున్నందుకు మన్నించు. అసలు ఇలా ఎందుకు చేసానన్నది నీకు తెలిస్తే నేను చేసింది తప్పనినువ్వనుకోవు... నీకు తెలియ చెప్పేందుకే ఈ యదార్ధాన్ని నీముందుంచుతున్నాను.

వసూ, నువ్వు నా ప్రాణానివే...అయినా...నీతో కూడా చెప్పకుండా నేను నోరు విప్పి చెప్పుకోలేకపోవటం...అది ..అది:... నా బలహీనత! నన్ను క్షమించవూ ? మొన్న 'ఎందుకిలా అయిపోయావే ?' అని నువ్వు నన్ను నిలదీసి అడిగినప్పుడు నోరు విప్పకుండా అలాగే ఉండిపోయాను.

ఒక్క క్షణం... ఒక్క క్షణం ... నా నోరు తెరచినట్లయితే ... నా వేదనా కడలి నీ ముందుప్పొంగి ఉండేది. కాని, నన్ను నేను కంట్రోల్ చేస్కోవడానికి ఎంత శక్తిని కూడతీసుకోవాల్సొచ్చిందో నీకు తెలీదు.

వసూ,నాకు పెళ్లయ్యిందన్న మాటే గాని, కన్యగా నేనాశించిన కోరికలుగానీ, కన్న కలలుగానీ ... ఏవీ నన్ను నన్ను వరించలేదు.పనిమనిషిగా ఇంట్లో పనులు చేయడం,కోడలిగా అత్తా, మావలకు సేవలు చేయడం, భార్యగా భర్త కోరినప్పుడు శరీరాన్నప్పగించడం...తప్ప ఈ ఇంట్లో ఓ మనిషిగా నాకు స్థానం లేదు.

నాకూ ఓ మనస్సుందనీ, దానికీ ఆలోచించేశక్తీ, ఆవేదన చెందన గల స్పందనా ఉన్నాయని ఈ ఇంట్లోవాళ్ళకు తెలియదు.

ప్రేమానురాగాలు లేని యాంత్రిక జీవితంలో బిడ్డ పుట్టడం ఆశ్చర్యమనిపించినా, నాఆశలూ, కోరికలూ పాప మీదకు మళ్ళించి. ఆవేదనలన్నింటినీ పక్కకు పెట్టి ఇన్నాళ్ళూ జీవించాను!

పాపాయిని చూసైనా అతను మారతాడనే ఆశ! కానీ, అది దురాశే అయింది... కన్నీటితో నా దిండు తడవని రాత్రి లేదేమో !

వసూ, నీకు తెలుసు... ప్రేమమానురాగాలకు నేనెంత అలమటిస్తానో... అందుకేనేమో భగవంతుడు వాటిని నాకు పూర్తిగా దూరం చేశాడు.

భర్త కౌగిలిలో కరిగిపోవాలని, భర్తగుండెల్లో ఒదిగిపోవాలనీ, భర్త ఒడిలో సేదదీరాలనీ, భర్త సన్నిధిలో సర్వమూ మరచిపోవాలనీ... భార్య కోరుకోవడం... తప్పా వసూ ?

ఈ కోరికల్లో ఏ ఒక్కటీ తీరలేదు. నన్నూ.... నా సహనాన్నీ గేలి చేస్తూ రెండేళ్ళు గడిచిపోయాయ్. ఇలా ఇంకా ఎంత కాలం ? నేనూ మనిషినేగా?

ఈ రోజు ... మా పెళ్ళిరోజు... అటో ఇటో ఈ రోజు తేల్చుకోవాలనుకున్నాను . అందుకే ఆయన కోసం చక్కగా అలంకరించుకున్నా. తనకిష్టమైన వంటకాలు చేసా. రాత్రి 8..9...10... గంటలు గడిచిపోతున్నాయ్...నిద్ర ఏనాడో దూరమయింది. ఇక ...ఇప్పుడు దుఃఖం కూడా...రాత్రి 2 గంటల 30 నిమిషాలకు తలుపు చప్పుడైయింది.

నా నాథుడు, మనోవిభుడు, ప్రత్యక్ష దైవం...వచ్చారు. నన్ను చూడనట్టుగానే గదిలోకి వెళ్ళిపోయారు. భోజనానికి రమ్మన్నాను , ఆకలి లేదన్నారు.

"ఇది మన పెళ్ళిరోజు. మీకిష్టమైనవన్నీ వండాను. అన్నీ చల్లారిపోయాయ్..అయినా నా తృప్తికోసం రండి" అన్నాను తెగించి.

"ఇలాంటి పిచ్చి సెంటిమెంట్లు పెట్టుకోకు. నేను భోంచేసే వచ్చాను" అని డబుల్‌కాట్ మీద అటు తిరిగి పడుకున్నారు.


ఇక నన్ను నేను ఆపుకోలేకపోయాను.

"అసలు నన్నెందుకు పెళ్ళి చేసుకున్నారు? నాకూ కోరికలూ, ఆశలూ ఉండవనుకున్నారా? నన్నెందుకిలా హింసిస్తున్నారు ? " ఆవేశం ముప్పిరిగొనగా అడిగాను.

పడుకున్న అతను లేచి , స్థిరంగా అన్నమాటలు...

"నువ్వు నా జీవితంలో ప్రవేశించకముందే,మరొక స్త్రీతో నా జీవితాన్ని పంచుకున్నాను.నా తల్లిదండ్రుల పోరుపడలేక , కేవలం వాళ్ళకావలసిన కట్నం కోసమే నిన్ను పెళ్లి చేసుకున్నాను. కాని నా హృదయంలో నీకు చోటు లేదు.

నువ్వనవసరంగా వృధా ప్రయాసపడకు , చూడూ.




డి. శ్రీధర్, డి. కొండాపూర్, రాయదుర్గం, అనంతపురం.

నీకిష్టం లేకపోతే వెళ్ళిపోవచ్చు...కావాలంటే పాపను కూడా తీసికెళ్ళు.ఇంత వివరంగా ఎందుకు చెప్తున్నానంటే ఇకముందు ఈ విషయంలో జోక్యం చేసుకోవద్దనీ...అంతే! వస్తాను..."చెప్పులు తొడుక్కుని చరచరా బయటికి వెళ్ళిపోయాడు.

సుడిగాలిలో దీపంలా రెపరెపలాడ్తోన్న జీవితానికి అతనిమాటల్లోనే గమ్యం కనిపించింది.

ఇప్పుడు నీ మనస్సులో ఏఏ ప్రశ్నలు అగ్నిలా మండుతున్నాయో, నాలోను అలాగే సెగలు రేగాయి.అతనికి మరొకరితో ముందే సంబంధమున్నప్పుడు నన్నెందుకు పెళ్ళాడాలి?

అమ్మా నాన్నలను అడ్డుపెట్టుకుని , అప్పనంగా వచ్చే డబ్బుకోసం ఆడపిల్లల నిండు జీవితాన్ని బలితీసుకునే నీచుల్ని ఈ సమాజం ఏవని పిలుస్తుందో, ఎలా సహిస్తుందో నాకుతెలీదు. నా జీవితం నాశనమయింది. అమ్మానాన్నా కష్టపడి సంపాదించిన డబ్బు నరరూపరాక్షసుల పాలయింది.

అతనపట్ల నాలో రేగిన అసహ్యం బ్రద్దలైన అగ్ని పర్వతంలా భగ్గున మండుతోంది. అతని పశుత్వానికి బలైన నా శరీరం మీద అసహ్యమేస్తోంది. ఏ అగ్నిలో దూకి ఈ దేహాన్ని ప్రక్షాళన చేయనూ? లాభంలేదు. నా శరీరాన్ని నా మనస్సునుండి వేరుచేయాలి. అంటే ఈ బ్రతుకుని ఇక ముగించాలి.

కాని ... నా పాప.. నా కన్నబిడ్డ... పాప జన్మకు అతనే కారకుడైనప్పటికీ , పాపమీద ఆ జుగుప్స లేదెందుకో... పైగా ఏదో మమకారం .... ఉప్పొంగుతూ...నా రక్తాన్నీ, ప్రాణాన్ని పంచుకుపుట్టిన నా బంగారు తల్లిని... నా ప్రతిరూపాన్ని... ఏం చేయను ? తల్లీ తండ్రీలేని అనాధగా... నో...అలా జరగడానికి వీల్లేదు... నా బిడ్డను నాలోనే కలుపుకుంటాను.

ఈ నా నిర్ణయం మీ కందరికీ బాధకారమని తెలుసు... ముఖ్యంగా అమ్మా, నాన్నా, చెల్లాయిలూ తట్టుకోలేరు వసూ, నా ప్రియతమా, వాళ్ళందరినీ నువ్వే ఓదార్చు... "మరి నన్నో "అంటున్నావా?

వద్దు తల్లీ...అలాఏడవకు...

మీ అందరిగురించీ ఆలోచిస్తే ... నా నిర్ణయంలో మార్పు రావచ్చు...అందుకే ఇక ముగిస్తాను ...ఈ లేఖనే కాదు... నా జీవితాన్ని కూడా... నిన్ను మరెన్నడూ చూడలేని

నీ ప్రియ ....

అరుణ

"అరుణా..."

నా అరుపుకు అందరూ పరిగెత్తుకొచ్చారు. అమ్మ నన్ను తన ఒడిలోకి తీసుకుంది.

నా చేతుల్లో తడిసిపోతోన్న ఉత్తరాన్ని అన్నయ్య తీసుకుని గట్టిగాచదివాడు.

'ఒక్కమాటైనా నాతో ఎందుకు చెప్పలేదు? నేను నీకేమీ కాననుకున్నావా ? ఒకే మనస్సు రెండు శరీరాలుగా జీవించిన మనల్ని వెధవ పెళ్ళి ఇంత దారుణంగా విడదీస్తుందనుకోలేదు. నిన్ను తిట్టో, కొట్టోబలవంతానైనా నీ బాధను తెలుసుకోలేకపోయిన నా ఆశక్తతకు నన్ను నేను క్షమించుకోలేను ' నా ఆలోచనల్లో నేనుండగానే అన్నయ్య ఉత్తరం ముగించాడు.

"పిల్ల పసిబిడ్డతో సహా ఇంత పనిచేసిందంటే అనాడే నేననుకున్నా... ఆ దుర్మార్గులేదో చేసుంటారని. కట్టుకున్న పెళ్ళాన్ని ప్రేమించలేనివాడు ప్రేమను గురించి మాట్లాడడం... ఛ...ఛ... వాడికి బుద్ధిలేదు. ..ఆ పెద్దవాళ్ళు అత్తామామలు...కళ్ళఎదుటే కన్న కొడుకు క్రమశిక్షణ లేకుండా, కట్టుకున్నదాన్ని దాని కన్నీళ్ళకు వదిలేసి, నీతి బాహ్యంగా తిరుగుతూంటే తల్లి దండ్రులుగాబుద్ధి చెప్పి మంచి మార్గంలోపెట్టొద్దా?

అదీ...వాడి ప్రియురాలు..సాటిఆడది ఇలా చేసిందంటే... ఆడజాతికంతకూ అవమాన మనిపిస్తోంది. ప్రేమించానని కబుర్లు చెప్పి, కట్నంకోసం తనను కాదని, మరోఆడదాన్ని పెళ్ళి చేసుకోవడానికి వాడు సిద్ధపడినప్పుడు ...దాని అభిమానం.. అభిజాత్యం ఏమైపోయాయ్...పెళ్ళి చేస్కోని పిరికిపందకి ఉంపుడు కత్తెగా ఉండడానికి సిద్ధపడిన స్త్రీ... చిఛీ... అందుకేఆడదానికిఆడదే శత్రువన్నారు" అమ్మ ఆక్రోశాన్ని ఎవరైనా అర్ధంచేస్కోగలరు.

మళ్ళీ అమ్మే అంది...." తోటి ఆడదాని మనశ్శాంతినీ, సౌభాగ్యాన్ని అమాంతంగా మింగేసే ఆడవాళ్ళున్నంత వరకూ భూమ్మీద స్త్రీలకు రక్షణ ఉండదమ్మా...అది అత్తగావచ్చు ... ఆడపడుచుకావచ్చు....ఇలాంటి ఉంపుడుగత్తెలు కావచ్చు. తప్పుదారిపట్టిన మగవాడికి బుద్ధి చెప్పే ఆడది లేకపోయే"

"నేనున్నానమ్మా తప్పుచేసిన వీళ్ళందరికీ బుద్ధి నేను చెప్తాను. వాళ్లని చట్టానికప్పచెప్పీ, ముప్పతిప్పలు పెట్టీ, వాళ్ళ అంతు తేల్చుకుంటాను. ఆడపిల్లల కన్నీటిని తాగి, రక్తాన్ని పీల్చీ , ప్రాణాన్ని హరించే ఇలాంటి రాక్షసుల్ని వెతికి వెతికిపట్టుకుని , అంతకంత అనుభవించేలా చేస్తానమ్మా...ఇలాంటి పిరికి పనులు చేయకండి... బ్రతికుండి పోరాడండి అని అరుణలందరికీ చెప్తానమ్మా నా వృత్తిని ఈ కేసుతోనే మొదలు పెడతాను... నన్నాశీర్వదించమ్మా" అమ్మ ఒడిలో నుండి లేచి, కళ్ళు తుడుచుకొని,అరుణ ఫోటోని చేతిలోకి తీసుకున్నాను. నేనన్న మాటలు అందరిలోనూ దుఃఖాన్ని దూరం చేశాయి.

"చిన్నీ...స్త్రీల ఆత్మహత్యలన్నీ దాదాపు హత్యలేనమ్మా ఎవరూ కావాలని చనిపోరు. జీవితంలో ఎంతో పోరాడి, అలసిపోయి, చివరకు ఈ విధంగా కారకులైన హంతకులు-డబ్బా, అధికారంప్రయోగించి శిక్ష ను తప్పించుకుంటున్నారు. ప్రజలు దీన్ని పట్టించుకోవడం లేదు. ఈ మహత్కార్యాన్ని నువ్వు చేపట్టు ...దైవం నీకు తోడుంటాడు " అమ్మ అంటూంటే .

"మా అందరి ఆశీర్వాదం ఎప్పుడూ నీకుంటుంది తల్లీ" నాన్నగారు నా తల నిమిరుతూ అన్నారు.

ఫోటోలోని అరుణ కూడా నన్ను వెన్నుతట్టు తున్నట్లనిపించగా...

"ఇంక ఆలస్యమెందుకు...పని ప్రారంభిద్దాం పద" అంటూ నా చేతినందుకున్న అన్నయ్యను అనుసరించాను.


ఝాన్సీ కె. వి. కుమారి

ఆలిండియా రేడియో,

నిజామాబాద్ .


# తెలుసుకుందాం!

## 'డైనమో'

డైనమో అనే పరికరాన్ని 'మైఖేల్ ఫారడె అనే శాస్త్రవేత్త కనిపెట్టాడు. అయస్కాంత శక్తి ద్వారా విద్యుత్తునుత్పత్తి చేసే సాధనాన్ని 'డైనమో' అంటారు. విద్యుదయస్కాంత స్వభావాన్ని తెలుసుకొన్న ఫారడే తన జ్ఞానాన్ని ఉపయోగించి డైనమోకు రూపకల్పన చేశాడు. 'విద్యుత్ ప్రసరించే తీగ చుట్టు నడుమ ఇనుప కడ్డీకి అయస్కాంత శక్తి లభించినపుడు, అయస్కాంత శక్తి నడుమ ఒక తీగ చుట్టను ఉంచితే దానికి విద్యుత్ లభించాలి గదా' అనే ఆలోచనను కార్యాచరణలో పెట్టి శతవిధాలా ప్రయత్నించి చివరకు డైనమోను కనిపెట్టాడు.

ఫారడే నిర్మించిన డైనమో అతడు సూచించిన సూత్రాలనే ఈనాటికీ బ్రహ్మాండమైన విద్యుదుత్పత్తికి మూల సూత్రాలు.